## క్లుప్తంగా

### మొక్కలకు నీరందించండి

పెబ్బేరు రూరల్: హరితహారంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత అందరిపై ఉందని అదనపు డీఆర్‌డీఓ నాగేంద్రం అన్నారు. శుక్రవారం వనపర్తి మండలంలోని పెద్దగుడెం తండాలోని అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలకు నీటిని అందించారు. మొక్కల సంరక్షణ కోసం పంచాయతీల వాటర్‌ట్యాంకర్లను వినియోగించుకోవాలన్నారు. అనంతరం నాచహళ్లిలో ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలు సమయపాలన పాటించి కొలతల ప్రకారం పని చేయాలని సూచించారు.

### మత్స్యకారుల కార్యవర్గం ఏర్పాటు

ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడ మత్స్యకారుల సహకార సంఘం కమిటీని ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు లక్ష్మయ్య తెలిపారు. శుక్రవారం గ్రామంలోని సంఘ భవనం వద్ద ఎన్నికల అధికారి సూచనల మేరకు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సభ్యులంతా చర్చించి కార్యవర్గాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అధ్యక్షుడిగా లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడిగా తిర్పతయ్య, ప్రధాన కార్యదర్శిగా రవి, డైరెక్టర్లుగా రాములు, శివయ్య, రవి, రాములు, వెంకటయ్య, బూసని గట్టును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారి బీక్యానాయక్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

### కనులపండువగా కల్యాణోత్సవం

ఆత్మకూరు: పట్టణ శివారులోని మల్లాపురం లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ వేద పండితులు రాఘవన్‌శర్మ, వెంకట శేషశర్మ కిశోర్ శర్మ ఆధ్వర్యంలో కల్యాణోత్సవం, ఇతర పూజలను జరిపించారు. భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

### కార్మికుల సమస్యలు పరిష్కరించండి



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రైస్ మిల్, ఆయిల్‌మిల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని.. రైస్‌మిల్ సంఘం జిల్లా అధ్యక్షుడు సి.వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా ఉన్న ఆ సంఘం కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మిల్లులలో పని చేసే మహిళ కార్మికులకు దుమ్ము వల్ల టీబీ, గర్భసంచి వ్యాధులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డిమాండ్లను పరిష్కరించాలని అనేక పోరాటాలు చేసినా ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేకుండా పోయిందని విమర్శించారు. డిమాండ్ల సాధన కోసం భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు చేసేందుకు కార్మికులు సిద్ధం కావాలని అన్నారు. కార్యక్రమంలో రైస్‌మిల్, ఆయిల్ మిల్ సంఘం నాయకులు నర్సిములు, చెన్నయ్య, చంద్రమ్మ, సరోజా, మణేమ్మ, నాజీయాబేగం, చంద్రకళ, లక్ష్మి పాల్గొన్నారు.

### ముగిసిన లక్ష్మీనారసింహ స్వామి బ్రహ్మోత్సవాలు



తాడూరు: మండలంలోని శిర్సవాడలో ఐదు రోజుల పాటు నిర్వహించిన లక్ష్మీనారసింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. స్వామివారికి చక్రస్నానంతో పాటు బోనాలతో మహిళలు స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల వెంట మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు.

### ఘనంగా రథోత్సవ వేడుకలు



మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో ఈశ్వర ఆంజనేయస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున భక్తులు స్వామివారి రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో అఖండ భజన కార్యక్రమాలతోపాటు అడుగుల భజన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తుల మధ్యన స్వామివారి రథోత్సవాన్ని గ్రామపుర వీధుల గుండా సాగింది. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

# వసతుల కల్పనకు నిధులు



అమ్మ ఆదర్శ పాఠశాల పనులకు ఎంపికైన పాన్‌గల్ ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల

- పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు
- గడువు సమీపిస్తుండడంతో పనుల్లో వేగం
- అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో పనులు



పాన్‌గల్ ఎస్సీకాలనీ పాఠశాలలో నీటి సంపులో నీరు నింపుతున్న సిబ్బంది

పాన్‌గల్: విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చదవడానికి ఆసక్తి కలిగేలా ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు కనీస వసతుల కల్పనకు కృషి చేస్తోంది. ఈ క్రమంలో జూన్ 12న పాఠశాలలు తెరిచే నాటికి కనీస సౌకర్యాలు కల్పించేలా చర్యలు ముమ్మరం చేసింది. దీంట్లో భాగంగా కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మార్చిలో అమ్మ ఆదర్శ పాఠశాల పథకాన్ని తీసుకొచ్చింది. దీని ద్వారా కనీస వసతులు లేని పాఠశాలలను ఎంపిక చేసి తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మతు తదితర పనులను చేపట్టేందుకు నిధులు మంజూరు చేసింది. వీటిని పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయిలో అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులకు అప్పగించారు. మండలంలో ఆయా కమిటీ సభ్యులు ఎంపిక చేసిన పాఠశాలల్లో మరమ్మతు పనులు ఇప్పటికే చేపట్టారు.

**యూ డైస్ ఆధారంగా నిధులు..**

పాఠశాలల వారీగా ప్రధానోపాధ్యాయులు యూడైస్ప్లస్‌లో పాఠశాల అవసరాలపై వివరాలను ప్రతి ఏడాది నమోదు చేస్తారు. వాటి ఆధారంగా పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ , టీఎస్ఈడబ్ల్యూ, ఐడీసీ తదితరులు క్షేత్ర స్థాయిలో పాఠశాలలను సందర్శించి నమోదు చేసిన వివరాలు సరిగ్గా ఉన్నాయో లేవో పరిశీలించి అవసరమైన సదుపాయాల కోసం ప్రతిపాదనలు విద్యాశాఖకు నివేదిస్తారు. మండలంలో 25 పాఠశాలలకు మరమ్మతులు అవసరమని గుర్తించారు. పనులు చేపట్టేందుకు రూ. 50 లక్షలకు పైగా ప్రతిపాదనలు పంపగా.. వాటిలో ప్రభుత్వం 25 శాతం నిధులు మంజూరు చేసినట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. వీటితో తాగునీరు, మరుగుదొడ్ల పునరుద్ధరణ, విద్యుత్ సదుపాయం, బాలికల కోసం ప్రత్యేక మరుగుదొడ్ల నిర్మాణం, ఇతర మరమ్మతుల కోసం నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

**మండలాల వారీగా..**

| మండలం | ఎంపిక చేసిన పాఠశాలలు | నిధులు(రూ.లక్షల్లో) ప్రతిపాదించిన | మంజూరైన |
|---|---|---|---|
| పాన్‌గల్ | 25 | రూ. 50.60లక్షలు | రూ.12.65 |
| చిన్నంబావి | 16 | రూ. 70.63 లక్షలు | రూ. 17.65 |
| వీపనగండ్ల | 14 | రూ.51.95 లక్షలు | రూ.12.95 |

**అమ్మ ఆదర్శ కమిటీల ఖాతాల్లో జమ**

ఎంపిక చేసిన పాఠశాలల్లో నిర్దేశించిన మరమ్మతు పనులు చేపట్టేందుకు ముందస్తుగా 25 శాతం నిధులు వారి ఖాతాలల్లో జమ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. చేస్తున్నా పనుల ఆధారంగా మిగతా నిధులు కూడా జమ చేయడం జరగుతుందని అధికారులు పేర్కొన్నారు.

**వసతులు మెరుగవుతాయి..**



ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడి విద్యార్థుల ఇబ్బందులు తొలుగుతాయి. తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్ సౌకర్యం వంటి మౌలిక వసతులు సమకూరుతాయి. ఆయా పనులు కూడా పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్నారు.

– పద్మ, హెచ్ఎం, పీఎస్ ఎస్సీ కాలనీ, పాన్‌గల్

**నాణ్యతగా చేస్తున్నాం..**



ప్రభుత్వ నిబంధనల మేరకు కమిటీల పర్యవేక్షణలో పాఠశాలల్లో మౌలిక వసతుల పనులు నాణ్యతగా చేపడుతున్నాం. ఈ పనులు పూర్తైతే విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయి. ఆయా పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మి, కమిటీ అధ్యక్షురాలు, పీఎస్, వెంగళాయిపల్లి

**పూర్తి చేస్తాం..**

పాఠశాలలు తెరిచే లోపు అభివృద్ధి పనులు పూర్తి చేసేలా తగు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం సూచించిన నిబంధనలను కమిటీ సభ్యులకు సూచించాం. ఎంపికై న పాఠశాలల్లో ఆయా పనులు జరుగుతున్నాయి. ఆయా పనుల్లో మరింత వేగం పెంచేలా చూస్తాం. పనులు నాణ్యతగా ఉండేలా పర్యవేక్షిస్తున్నాం.

– లక్ష్మణ్‌నాయక్, ఎంఈఓ, పాన్‌గల్

# మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

పాన్‌గల్: నర్సరీలలో, హరితహారంలో నాటిన మొక్కలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని సంరక్షించాలని ఏపీఓ కుర్మయ్య అన్నారు. శుక్రవారం చెట్టు చెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్నారంలో నర్సరీలను పరిశీలించి, రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీరు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొక్కలకు క్రమం తప్పకుండా వాటర్ క్యూరింగ్ చేయాలన్నారు. దీంతో పాటు మండలంలోని మాధరావుపల్లి, చిక్కేపల్లిలో ఉపాధి పనులను పరిశీలించి కొలతల ప్రకారం పనులు చేస్తే కూలి గిట్టుబాటు అవుతుందన్నారు. కూలీల మస్టర్స్‌ను ఆయన పరిశీలించారు. పనులకు వచ్చే రోజు వారి కూలీల సంఖ్యను పెంచాలని, పనుల వద్ద నీడ, నీటి వసతిని తప్పక ఏర్పాటు చేయాలన్నారు.

అమరచింత: గ్రామాల్లో హరితహారం ద్వారా నాటిన మొక్కల సంరక్షణ కోసం ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. చెట్టు చెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పాంరెడ్డిపల్లెలో ఎంపీడీఓ మొక్కలకు నీటిని అందించారు.



చిక్కేపల్లిలో మస్టర్స్‌ను పరిశీలిస్తున్న ఏపీఓ కుర్మయ్య

# నేలకొరిగిన చెట్లను తొలగించండి



అన్నారం సమీపంలో రోడ్డు పక్కన నేలకొరిగిన చెట్టు

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు అన్నారం, అన్నారంతండా, దావాజిపల్లిలో రోడ్లకు ఇరువైపులా చెట్లు ఈదురుగాలులకు నేలకొరిగాయి. ప్రయాణికులకు, రైతులకు ఇబ్బందిగా మారాయి. చెట్లను ఆయా పంచాయతీ కార్యదర్శులు తొలగింపజేస్తారా లేక ఉపాధి సిబ్బంది తొలగిస్తారా, ఆర్అండ్‌బీ శాఖ వారు తొలగిస్తారనే విషయం తెలియడంలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నెలకొరిగిన చెట్లను తొలగించాలని కోరుతున్నారు.

# కాపరులు సద్వినియోగం చేసుకోవాలి

పాన్‌గల్: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జీవాలకు వేసే పాటు రోగం టీకాలను కాపారులు సద్వినియోగం చేసుకుని తమ జీవాలకు వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి శ్యామ్ అన్నారు. శుక్రవారం మండలంలోని మాందాపూర్, చింతకుంటలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు టీకాలు వేశారు. వర్షాకాలం ప్రారంభంలో లభ్యమయ్యే పచ్చిమేత వల్ల జీవాల్లో పాటు రోగం సోకి మరణాలు సంభవిస్తాయన్నారు.



పాన్‌గల్‌లో జీవాలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

# ‘ప్రజలు జయరాములును మరువలేరు’



జయరాములు సమాధికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తిటౌన్: వనపర్తి ప్రజలు దివంగత మాజీ ఎమ్మెల్యే జయరాములును ఎప్పటికీ మరువలేరని డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీర్ల చందర్ అన్నారు. శుక్రవారం ఆయన వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సమాధికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వనపర్తి నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా పని చేసినప్పుడు అభివృద్ధికి ఎంతగానో పాటుపడ్డాడని గుర్తుచేశారు. కార్యక్రమంలో సతీష్, కృష్ణబాబు, చీర్ల జనార్దన్, పెంటన్న యాదవ్, నారాయణ, ఆంజనేయులు, వెంకటేష్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

**మాజీ ఎమ్మెల్యేకు నివాళి..**

పెబ్బేరు రూరల్: అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్‌యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే జయరాములు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రంలోని మరికుంటలోని పాలకేంద్రం వద్ద కుటుంబసభ్యులు, అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు సమాధికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వనపర్తి పట్టణంలోని ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన వర్ధంతి సభలో జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డితో పాటు పలువురు వక్తలు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# ప్రశాంతంగా పాలిసెట్



కొత్తకోటలో హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

కొత్తకోట రూరల్: పాలిసెట్ అర్హత పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. పట్టణ కేంద్రంలోని నివేదిత జూనియర్ కళాశాల, నివేదిత స్కూల్‌లో మొత్తం 328 మంది విద్యార్థులకు గాను 23మంది గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం నిర్వాహకులు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ ఘటనలు కాకుండా 144 సెక్షన్ విధించడంతో పాటు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఏఎస్ఐ సాగర్ తెలిపారు.

**ప్రారంభమైన ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు..**

పట్టణ కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్ సప్లమెంటరీ ప్రథమ సంవత్సర పరీక్షకు 67మందికి గాను 63మంది హాజరు కాగా, ద్వితీయ సంవత్సరం 19మంది గాను 18మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో ఉదయం ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 42మందికి గాను 39మంది, ఇంటర్ ద్వితీయ సంవత్సరం 17మందికి గాను అందరూ హాజరైనట్లు ప్రిన్సిపాల్ హైమావతి తెలిపారు.



పాన్‌గల్‌లో పరీక్షలపై ఇన్విజిలేటర్లకు సూచనలు చేస్తున్న చీఫ్ సూపరింటెండెంట్

**9 మంది గైర్హాజరు**

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పాలిసెట్ పరీక్షకు మొత్తం 158 మందికి 9 మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, అబ్జర్వర్ అజిత్ తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 149 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.

### వ్యక్తి ఆత్మహత్య

ఆత్మకూరు: జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మొట్లంపల్లికి చెందిన రాములు (42) భార్యా, పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మూడు రోజుల క్రితం సొంత గ్రామానికి వెళ్లివస్తానని వచ్చి ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం చుట్టుపక్కల వారికి దుర్వాసన రావడంతో గమనించి హైదరాబాద్‌లోని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. కొంతకాలంగా ఆలయన అనారోగ్యంతో బాధపడుతున్నాడని, అందుకే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. మృతుడి భార్య మన్నెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుర్లు ఉన్నారు.

### ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవాలి

ఆత్మకూరు: ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా అప్రమత్తంగా ఉంటూ కాపాడుకోవాలని జెడ్పీ సీఈఓ యాదయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మదనాపురం, ఆత్మకూరు మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లోని వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాలు, పల్లెప్రకృతివనాలు ఇతర ప్రభుత్వ ఆస్తులను సంరక్షించాలన్నారు. నిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. జెడ్పీ డిప్యూటీ సీఈఓ రామమహేశ్వర్‌రెడ్డి, సూపరింటెండెంట్ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

# కనుల పండువగా నర్సింహస్వామి రథోత్సవం

- రథోత్సవంలో వేలాది మంది భక్తులు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మాగనూర్: మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం కనుల పండువగా కొనసాగింది. ఇందులో భాగంగా తెల్లవారుజామున రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పల్లకిలో బాజాభజంత్రీల మధ్య స్వామివారి విగ్రహం ముందుకు కదిలింది. మహారాష్ట్ర, కర్ణాటక, హైదారబాద్ లాంటి ప్రాంతాల నుంచి వేలాదిగా స్వామివారి దర్శనంకోసం భక్తులు తరలివచ్చారు. పలు పార్టీల నాయకులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

**పాల ఉట్ల ఉత్సవం..**

సాయంత్రం పాల ఉట్ల ఉత్సవాన్ని నిర్వహించారు. 25మందికి పైగా యువకులు పాల ఉట్ల స్తంభాన్ని ఎక్కేందుకు పోటీ పడ్డారు. అయితే ఈ సారి గ్రామ పెద్దలు ముందుగా కొంతసేపు చిన్నారులను పాల ఉట్లు ఎక్కించారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రాజు, జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీపీ శ్యామలమ్మ, మాజీ ఉపసర్పంచ్ సుధా, ఆలయ కమిటీ సభ్యులు వాకిటి వాబయ్య, బలరాజు, నరేష్, వాకిటి శ్రీనివాసులు, కృష్ణయ్య, సత్యప్ప, ఆనంద్, గ్రామ పెద్దలు, ఆనంద్‌గౌడ్, వెంకటయ్య, చెన్నప్ప, ఉజ్జెల్లి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉక్కపోతకు వర్షంతో ఉపశమనం

అమరచింత: వారం రోజుల నుంచి ఎండ తీవ్రతతో అలమటించిన ప్రజలకు శుక్రవారం కురిసిన వర్షం ఉపశమనం ఇచ్చింది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. రోహిణి కార్తెకు ముందే వర్షం రావడంతో రోహిణి ఎండల తీవ్రత అధికంగా ఉండకపోవచ్చని ప్రజలు చర్చించుకుంటున్నారు. వర్షం కురవడంతో వ్యవసాయదారులు తమ మెట్ట పొలాలను దుక్కి దున్నుకోనేందుకు సిద్ధమవుతున్నారు.



అమరచింతలో కురుస్తున్న వర్షం

# పంటకు బలం.. రైతుకు లాభం



కొత్తకోట మండలం పాలెంలో సాగవుతున్న పచ్చిరొట్ట

- పచ్చిరొట్ట సాగుకు సమయమిదే..

కొత్తకోట రూరల్: తొలకరి వర్షాలు పడే సమయంలో భూమిని ఖాళీగా ఉంచకుండా పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుంటే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని, సాగుకు అనువైన సమయం ఇదేనని మండల వ్యవసాయ అధికారి షేక్‌మున్నా తెలిపారు. భూసారాన్ని పెంచుకుంటూ అధిక దిగుబడులకు పచ్చిరొట్ట ఎంతగానో దోహదపడుతుందన్నారు. సేంద్రియ ఎరువులతోనే పంట దిగుబడిని రెట్టింపు చేసుకోవచ్చనని తెలిపారు. ప్రధానంగా జీలుగ పచ్చిరొట్ట విత్తనాలను ఈ సీజన్‌లో తప్పనిసరిగా పొలాల్లో చల్లినట్టయితే రసాయన ఎరువులతో అంతగా పని ఉండదన్నారు.

**ఉపయోగాలు..**

- జీలుగా విత్తనాలు చల్లుకోవడం ద్వారా నేల కోతకు గురికాదు.
- పచ్చిరొట్ట పైరు పొలంలో కలుపు మొక్కల పెరుగుదలను పూర్తి కంట్రోల్ చేస్తుంది.
- పచ్చిరొట్ట పూతదశలో ఉండగా లేదా విత్తనాలు వేసిన 50రోజుల తర్వాత పొలాన్ని కలియదున్నాలి.
- ఆ విధంగా దున్నడం వల్ల నేలకు సేంద్రియ పదారథం సమకూరుతుంది. అలాగే నేల గుల్లబారుతుంది. తద్వారా మొక్కల వేళ్లు బాగా పెరిగి పోషకులు బాగా గ్రహిస్తాయి. నేలల్లో చౌడు తగ్గుతుంది.
- నేలకు మేలు చేసే సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి.
- జీలుగ పైర్ల వేళ్లపై ఉండే బొడిపెలు గాలిలో నత్రజనిని స్వీకరిస్తాయి.
- కుళ్లిన రొట్ట ద్వారా భూమికి నత్రజని, భాస్వరం , పొటాష్ వంటి ఎరువులు ఆ తర్వాత వేసే పంటలకు లభిస్తాయి.
- సూక్ష్మపోషకాలు అయినా ఇనుము, జింక్, మెగ్నీషియం, కాల్షియం వంటివి భూమి నుంచి లభిస్తాయి.
- పచ్చిరొట్ట పైర్ల వల్ల ఎకరాకు 7కిలోల నత్రజని 1.2కిలోల భాస్వరం, 5కిలోల పొటాష్ వంటి ఎరువులు పంటకు లభిస్తాయి. తద్వారా ఎరువుల వాడకం సగానికి సగం తగ్గి దిగుబడి పెరుగుతుంది.
- పచ్చిరొట్ట పైరును భూమిలో కలియదున్నిన 15రోజుల తర్వాత పొలంలో నాట్లు వేయవచ్చు.

# నిరుపయోగంగా నీటితొట్లు



నిరుపయోగంగా బొల్లారం గ్రామ పశువుల తొట్టి

వీపనగండ్ల: తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల మండలంలోని 14 పంచాయతీలలో ఉన్న 1.5లక్షల మూగ జీవాలు తాగునీటి వసతులు లేక అల్లాడిపోతున్నాయి. గ్రామాలలో కనీసం నీటి తొట్లను ఏర్పాటు చేసి మూగజీవాలకు నీరు అందించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించడంతో రైతులు, కాపరులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

**నీటితొట్ల నిర్మాణాలకు ఎంపిక చేసిన గ్రామాలు**

వేసవిలో జీవాలకు నీరు అందివ్వాలన్న ఉద్దేశంతో అధికారులు ముందస్తుగా గ్రామాలలో నీటి తొట్లను నిర్మించాలని అంచనాలు వేశారు. రంగవరంలో ఒకటి, గోపల్‌దిన్నెలో రెండు, వీపనగండ్లలో 2, గోవర్ధనగిరిలో 2, నాగర్లబండతండాలో ఒకటి, పుల్గర్‌చర్లలో ఒకటి, వల్లాభాపురంలో ఒకటి నిర్మించాలని తలంచారు.

**నిర్మించి వదిలేసినవి కొన్ని..**

కల్వరాల్లలో నాలుగు నీటి తొట్లు ఉండగా, రెండు పనిచేయడం లేదు. వల్లాభాపురంలో ఒకటి, బొల్లారంలో ఒకటి, కొర్లకుంటలో ఒకటి, పుల్గర్‌చర్లలో ఒకటి, సంపత్‌రావుపల్లిలో ఒకటి, సంగినేనిపల్లి ఒకటి, తూముకుంటలో ఒకటి కొద్దిపాటి మరమ్మతు చేస్తే వినియోగంలోకి వస్తాయి.

**ఉన్నతాధికారుల అనుమతి తీసుకుంటాం..**



మూగ జీవాల తాగునీటి వసతి కోసం పశువుల తొట్ల నిర్మాణాల కోసం నివేదికలు పంపించి ఉన్నతాధికారుల అనుమతి కోరుతాం. గ్రామాలలో మూగ జీవాలకు పూర్తి స్థాయిలో ఇబ్బందులు ఉంటే రైతులు తమ దృష్టికి తెస్తే తమ పరిధిలో ఉన్నవాటిని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తాం.

– శ్రీనివాసారావు, ఎంపీడీఓ, వీపనగండ్ల